
# సాక్షి

## శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం ၊ 7 ၊ జూన్ ၊ 2023



### సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో మంగళవారం 38.593 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు, ఉత్తర, దక్షిణ కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు.



### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10గ్రాములు): | రూ.61,920 |
| 22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా): | రూ.5,561 |
| 3శాతం జీఎస్టీతో: | రూ.5,728 |
| నవర (8గ్రా) | రూ.45,824 |

గరిష్ఠం/కనిష్ఠం
42.3 /31.0

### వాతావరణం

జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యాయి. గాలిలో 35 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు.

## న్యూస్‌రీల్

### గంగమ్మ ఆలయంలో అభిషేకాలు, హోమాలు



గంగమ్మ నూతన విగ్రహానికి ప్రత్యేక పూజలు

**నెల్లూరు రూరల్:** రూరల్ పరిధిలోని పడారుపల్లిలో వెలసిన శ్రీగంగమ్మ ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం విశేష పూజల్లో భాగంగా మంగళవారం రాత్రి పలు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నవనీత ఆధివాసం, యాగమండప దేవతా హోమాలు, గ్రామోత్సవం జరిపారు. సాయంత్రం అష్టోత్తర శతకలశ అభిషేకం, ధ్యానాధివాసం, యాగమండప దేవతా పూజలు చేశారు. స్థానికంగా ఉన్న వారు సమీపంలోని భక్తులు ఆలయంలో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. కుర్తాళం సిద్ధేశ్వర పీఠం పండితులు బ్రహ్మశ్రీ మాచవోలు రమేష్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు కాకుటూరు శ్రీహరి, స్థానిక పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



దేవతామూర్తులకు అష్టోత్తర శతకలశ అభిషేకం

# గీత దాటారో.. ఫైన్ పడుద్ది



- నిబంధనల అతిక్రమణపై రవాణాశాఖ సీరియస్
- ఈ-చలానాల జోరు పెంచిన అధికారులు
- జాతీయ రహదారిపై నిత్యం తనిఖీలు
- ఓవర్‌స్పీడు, నో హెల్మెట్, డ్రంక్ అండ్ డ్రైవ్‌లపై కేసులు
- ఓవర్‌స్పీడుపై ఏడాదిలోనే రూ.కోటికి పైగా వసూలు
- రెండోసారి చలానా రాస్తే రూ.10 వేలు ఫైన్

☛ జాతీయ, రాష్ట్ర రహదారులపై మేం స్పీడుగా వెళుతున్నాం. మమ్మల్ని ఎవరూ పట్టించుకోలేదు.

☛ మద్యం తాగి ఊగుతూ వెళుతున్నా మమ్మల్ని ఎవరూ చూడలేదు.

☛ హెల్మెట్ లేకుండా, బైకుపై ముగ్గురం కూర్చొని వెళుతున్నా మమ్మల్ని ఎవరూ ఆపలేదు.

ఇలాగే భావిస్తున్నారా. అయితే వాహనదారులు పప్పులో కాలేసినట్లే. వాహనాన్ని ఆపి తనిఖీ చేసి కేసులు రాసే రోజులు పోయాయి. తాజాగా నిబంధనలు అతిక్రమించి వెళుతున్న వాహనాల ఫొటోలు తీసి నేరుగా వాహనదారుడి ఇంటికి ఫైన్‌తో చలానాలు పంపించే రోజులు వచ్చాయి.

**నెల్లూరు (టౌన్):** జిల్లాలో 176 కిలోమీటర్లు మేర జాతీయ రహదారి ఉంది. దీంతో పాటు రాష్ట్ర రహదారులు ఉన్నాయి. ఈ రహదారులపై నిత్యం వందల సంఖ్యలో ట్రాన్స్‌పోర్ట్, నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ప్రధానంగా వాహనదారులు నిబంధనలు అతిక్రమించడం వల్లే రహదారులపై ఎక్కువ సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నట్లు జిల్లా రవాణా అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు 2 స్పీడు లేజర్‌గన్‌లు, 30కు పైగా బ్రీత్ ఎనలైజర్‌లను కొనుగోలు చేసి ప్రతిరోజు తనిఖీలు చేస్తున్నారు. తనిఖీల్లో ఏదో ఒక ప్రాంతంలో మద్యం తాగి పట్టుబడుతున్న వాహనదారులు ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారు. అదే విధంగా జాతీయ రహదారిపై ఏ ప్రాంతంలో ఎంత స్పీడు పోవాలన్న దానిపై బోర్డులు ఏర్పాటు చేశారు. ఎక్కువ స్పీడు వెళ్లినట్లయితే స్పీడ్ లేజర్‌గన్‌లో వాహన వేగం నమోదవుతుంది. వాహన నెంబరు ఆధారంగా యజమాని అడ్రస్, వివరాలు తెలుస్తాయి.

**ఇంటికే ఈ-చలానా**

నిబంధనలు అతిక్రమించిన వాహనాదారుల ఇళ్లకు ఈ-చలానాలు పంపిస్తున్నారు. అడ్రస్ ఆధారంగా ఫైన్ విధించి వారంలో చెల్లించాలని చలానాలో పేర్కొంటున్నారు. అయితే సెల్‌ఫోన్‌లో ఈ-చలానా యాప్ డౌన్‌లోడ్ చేసుకుని నెంబరు టైప్ చేసినా ఫైన్ వివరాలు తెలుస్తాయి. అయితే చాలామందికి ఈ-చలానాపై అవగాహన లేకపోవడంతో పదుల సంఖ్యలో కేసులు పేరుకుపోతున్నాయి. ట్యాక్స్ చెల్లింపు, రీ రిజిస్ట్రేషన్, పర్మిట్ తదితర సమయాల్లో ఈ-ఫైన్‌ల విషయాలు బయటపడతాయి. ఫైన్ చెల్లిస్తేనే తరువాత ట్రాన్సాక్షన్‌కు అడుగు ముందుకు పడుతుంది. ఒకసారి ఫైన్ పడిన వాహనానికి అదే తప్పు మళ్లీ చేసినట్లయితే రూ.10వేలు ఫైన్ విధించనున్నారు.



స్పీడ్‌గన్‌తో ఓవర్‌స్పీడును తనిఖీ చేస్తున్న రవాణా అధికారులు

**ఏ తప్పుకు ఎంత ఫైన్ అంటే..**

| | |
|---|---|
| ఓవర్ స్పీడు | రూ.1400 |
| సెల్‌ఫోన్ వినియోగం | రూ.1000 |
| రాంగ్ రూట్ డైరెక్షన్ | రూ.1000 |
| ట్రిపుల్ రైడింగ్ | రూ.1000 |
| లైసెన్స్ లేకుంటే | రూ.1000 |
| రాంగ్ పార్కింగ్ | రూ. 1000 |

**లక్షల్లో కేసులు నమోదు**

నిబంధనలు అతిక్రమించిన వాహనాదారులపై రవాణాశాఖ అధికారులు లక్షల్లో అపరాధ రుసుం వసూలు చేస్తున్నారు. ఫైన్ విధించిన వివరాలను ఒకసారి పరిశీలిస్తే..

| సంవత్సరం | కేసులు | అపరాధ రుసుం |
|---|---|---|
| 2021-22 | 5,189 | రూ.51.89 లక్షలు |
| 2022-23 | 675 | రూ.64.84 లక్షలు |
| ఓవర్ స్పీడు (స్పీడ్‌గన్‌తో) | | |
| 2021-22 | 8,500 | రూ.1, 19 కోట్లు |
| 2022 -23 | 7,026 | రూ.98.36 లక్షలు |

అంటే మొత్తం 2021-22 కు సంబంధించి రూ.1,70,85,000, 2022-23కు సంబంధించి రూ.1,63,20,000 పెనాల్టీల ద్వారా వసూలు చేశారు.

**నిబంధనలు పాటించాల్సిందే**



ప్రతి వాహనదారుడు తప్పకుండా ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందే. ఒకరు చేసిన తప్పు వల్ల మరొకరి ప్రాణాలు పోతున్నాయి. ప్రతిరోజు రహదారులపై తనిఖీలు నిర్వహిస్తున్నాం. నిబంధనలు అతిక్రమించినట్లయితే వాహనదారులు ఇళ్లకు చలానాలు పంపిస్తున్నాం. ఒకసారి ఫైన్ పడిన వాహనం రెండోసారి పట్టుబడితే రూ.10వేలు ఫైన్ విధిస్తాం. ఈ చలానాలు స్పీడు పెంచుతున్నాం. అందరూ జాగ్రత్తగా వాహనాలను నడపాలి.

– బి.చందర్, డీటీసీ

## కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ హర్షణీయం

- ఏపీజీఈఎఫ్ చైర్మన్ చేజర్ల



మాట్లాడుతున్న ఏపీజీఈఎఫ్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు తదితరులు

**నెల్లూరు(అర్బన్):** దీర్ఘకాలికంగా రెగ్యులైజేషన్ కోసం ఎదురుచూస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు తీపి కబురు అందిస్తూ క్రమబద్ధీకరణ చేసేందుకు సీఎం చర్యలు చేపట్టడం హర్షణీయమని ఏపీజీఈఎఫ్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆ సంఘానికి చెందిన నాయకులు సంతపేటలోని ఆ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. మంత్రివర్గ కమిటీ ద్వారా ముఖ్యమంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాల్లో ఎంతో సంతోషం వెల్లివిరుస్తోందన్నారు. అలాగే కాంట్రాక్టు ఉద్యోగుల్లో మృతిచెందిన వారి కుటుంబాల్లోని వ్యక్తులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కోసం అహర్నిశలు కృషిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డికి, జనరల్ సెక్రటరీ అరవపాల్‌కి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజీఈఎఫ్ జిల్లా జనరల్ సెక్రటరీ దేవిరెడ్డి రమణారెడ్డి, హంస జనరల్ సెక్రటరీ కమల్‌కిరణ్, ఏపీటీఎస్‌ఏ జిల్లా నాయకులు రెహమాన్, ఖాదర్‌వలి, రాజేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క రోజులోనే అర్హులకు ధ్రువీకరణ పత్రాలు



అధికారులతో సమీక్షిస్తున్న పీడీ సాంబశివారెడ్డి

**మనుబోలు:** పిడూరు గ్రామంలో పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా అవసరమైన ప్రతి ఒక్కరికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను బుధవారం ఒక్కరోజులోనే అందజేస్తామని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి అన్నారు. మండలంలోని పిడూరు సచివాలయంలో మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిడూరు గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసినందున ప్రజలకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేసేందుకు సోమ, మంగళవారాల్లో సర్వే చేయమని వలంటీర్లను ఆదేశించామని తెలిపారు. ఈ సర్వేలో గ్రామంలోని 11 క్లస్టర్‌ల పరిధిలోని 643 కుటుంబాల నుంచి 741 సేవల కోసం వినతులు వచ్చాయని తెలిపారు. వీరందరికి బుధవారం ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని తెలిపారు. అంతకుముందు డీపీఓ సుస్మితారెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ సంజనాసింహ ఇదే విషయంపై సమీక్ష జరిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఓ వసుమతి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏఓ రవికుమార్‌రెడ్డి, ఆర్‌ఐ శివప్రసాద్, ఏపీఓ రాజమ్మ, ఏపీఎం వనజాక్షి, కార్యదర్శులు కృష్ణవేణి, రేష్మసోని, వీఆర్వో శీనమ్మ తదితరులున్నారు.



బీపీసీఎల్ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్

## పెట్రో ఉత్పత్తుల సరఫరాకు పైప్‌లైన్

- కృష్ణపట్నం పోర్టు నుంచి హైదరాబాద్ వరకు
- బీపీసీఎల్ ప్రతినిధులతో సమీక్షలో జేసీ కూర్మనాథ్ వెల్లడి

**నెల్లూరు(దర్గామిట్ట):** భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఉత్పత్తుల సరఫరాకు పైప్‌లైన్ నిర్మాణం, భూసేకరణ పనులు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతోను, బీపీసీఎల్ కాంపిటేటివ్ అథారిటీ సభ్యులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కృష్ణపట్నం పోర్టు నుంచి హైదరాబాద్ వరకు భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వారి పెట్రో ఉత్పత్తులు పైప్‌లైన్ ద్వారా సరఫరా చేసేలా 434 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో 308 కిలోమీటర్లలో భూముల్లో ఐదున్నర అడుగుల లోతులో పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. జిల్లాలో 11 మండలాల్లో ఇందుకు సంబంధించి భూసేకరణ వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీపీసీయల్ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, కావలి, నెల్లూరు ఆర్డీఓలు శీనానాయక్, మలోలాతో పాటు బీపీసీయల్ కాంపిటేటివ్ అథారిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ప్రాజెక్ట్ లీడర్ ఉమారాణి, ప్రాజెక్ట్ మేనేజర్ నరసింహారావు, జనార్దన్, పలువురు తహశీల్దార్లు పాల్గొన్నారు.

## మరింత పెరిగిన పొగాకు ధర

**ఆత్మకూరురూరల్ (మర్రిపాడు):** మర్రిపాడు మండలం డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో ధరలు మరింత పెరిగాయి. కిలో పొగాకు అత్యధిక ధర సోమవారం రూ.209 పలకగా, మంగళవారం రూ.212కు చేరింది. వివిధ గ్రామాలకు చెందిన రైతులు 877 పొగాకు బేళ్ల వేలం కేంద్రానికి తీసుకురాగా, 792 బేళ్లను బయ్యర్లు వేలంలో కొనుగోలు చేశారు. 85 బేళ్ల వివిధ కారణాలు వల్ల వేలం నుంచి తిరస్కరించారు. సగటు ధర రూ.206.83 చేరడం వేలం కేంద్రం చరిత్రలో రికార్డుగా నిలిచింది.



వేలానికి వచ్చిన పొగాకు బేళ్లు

## భూసేకరణ పనులు వేగవంతం చేయండి

- అధికారులకు కలెక్టర్ ఆదేశాలు
- జేసీ, సబ్ కలెక్టర్‌తో కలసి సమీక్ష



భూసేకరణపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

**నెల్లూరు (దర్గామిట్ట):** జిల్లాలో మంజూరైన సాగునీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జేసీ కూర్మనాథ్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభికలతో కలసి ఆయన ప్రాజెక్ట్‌లకు భూసేకరణ ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోమశిల హైలెవల్ లిఫ్ట్ కెనాల్ ఫేజ్-1, 2 ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సంబంధిత ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తెలుగుగంగ ప్రాజెక్ట్ ఎస్ఈ హరినారాయణరెడ్డి, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు, తెలుగుగంగ ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**యువతకు ఉపాధిపై దృష్టి సారించాలి**

మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వృత్తి నైపుణ్య కోర్సుల్లో యువతకు శిక్షణ ఇచ్చి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులకు సూచించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టర్ తన ఛాంబర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న వృత్తి నైపుణ్య కోర్సులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతకు ఉపయోగపడే వృత్తి విద్య కోర్సులను ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న ఏసీ, ఫ్రిడ్జ్ మెకానిక్, ప్లంబింగ్, డ్రైవింగ్, క్రేన్ ఆపరేటింగ్, పెయింటింగ్ తదితర కోర్సుల్లో యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలన్నారు. తొలుత జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి విజయ్ కుమార్ స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌లలో చేపడుతున్న శిక్షణా కార్యక్రమాలు క్లుప్తంగా వివరించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, గవర్నమెంట్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి, జేఈఓ భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రత్యేక అవసరాల పిల్లల ఆరోగ్యంపై దృష్టి పెట్టండి**

ఆరు సంవత్సరాల లోపు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను 100 శాతం గుర్తించి వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ సర్వశిక్ష అభియాన్, ఐసీడీఎస్, వైద్యాధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో సర్వశిక్ష అభియాన్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారులతో, డీఎంహెచ్‌ఓ, ఎన్ఆర్‌హెచ్‌ఎం అధికారులతో కలెక్టర్ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అందించవలసిన సేవలపై చర్చించారు. వీరిని గుర్తించడానికి అంగన్‌వాడీ, వెల్ఫేర్ అసిస్టెంట్ల సహకారం తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికి సదరం సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులు ఇప్పించాలన్నారు. పాఠశాలలకు వెళ్లలేని వారిని గుర్తించి ఆలాంటి వారికి ఇంటి వద్ద పౌష్టికాహారం, విద్య అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సర్వశిక్షా అభియాన్ పీడీ ఉషారాణి, ఐసీడీఎస్ పీడీ సౌజన్య, డీఈఓ గంగాభవాని, డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకట ప్రసాద్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ ఆలీ, ఐఏపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సురేష్‌బాబు, రెడ్ క్రాస్ సెక్రటరీ మస్తానయ్య, ఎన్ఆర్‌హెచ్‌ఎం డాక్టర్‌లు పాల్గొన్నారు.

## డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ

**నెల్లూరు(అర్బన్):** స్థానిక మైపాడుగేటు సమీపంలోని పీసీనాయుడు వీధిలో గల వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్‌లు చెక్‌చేశారు. ఆయుష్మాన్ భారత్ రికార్డులు పరిశీలించారు. స్టోర్‌లో మందులున్నాయో లేదా పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటప్రసాద్ మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. రోగులకు నాణ్యమైన వైద్యసేవలందించాలని ఆదేశించారు. డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్ తదితరులు

## సుర్రుమన్న సూరీడు

నిర్మానుష్యంగా మారిన ఆత్మకూరు బస్టాండు వద్ద గల ఫ్లైఓవర్



- విలవిలలాడిన పిల్లలు, వృద్ధులు

**నెల్లూరు(దర్గామిట్ట):** భానుడు మంగళవారం ఉగ్రరూపం దాల్చాడు. జిల్లాలో గరిష్ఠంగా 42.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. ఎండ వేడిమికి ప్రజలు విలవిలలాడారు. నెల్లూరు నగరంలో కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. ఉదయం 10 గంటలకే భానుడు ప్రతాపాన్ని చూపడం ప్రారంభించాడు. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు ముఖాలకు వస్త్రాలు చుట్టుకోవాల్సి వచ్చింది. సాయంత్రం ఐదు గంటల సమయంలో కూడా 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం ఆశ్చర్యానికి గురిచేసింది. రాత్రి 7 గంటల వరకు సెగలు తగ్గలేదు. అసలే ఎండాకాలం, సూర్యుడు మరింత ఉగ్రరూపం దాల్చడంతో పసిబిడ్డలు, వృద్ధులు అల్లాడిపోయారు.





ఎండవేడిమి భరించలేక ముఖాలకు వస్త్రాలు చుట్టుకుని ద్విచక్ర వాహనాలపై వెళుతున్న మహిళలు

## విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులు ఆప్షన్లు పెట్టుకోవాలి

**నెల్లూరు (టౌన్):** ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, మండల ప్రజా పరిషత్తు పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల నుంచి స్కూల్ అసిస్టెంట్‌లుగా, పీఈటీల నుంచి పీఈలుగా పదోన్నతులు విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులు బదిలీల్లో ఆన్‌లైన్ ద్వారా వెబ్ ఆప్షన్ పెట్టుకోవాల్సిందిగా డీఈఓ గంగాభవాని ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిషు) జిల్లా పరిషత్తు 110 మంది, స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిషు) ప్రభుత్వ 1, స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్) ప్రభుత్వ 1, స్కూల్ అసిస్టెంట్ (పీఈ) జిల్లా పరిషత్తు 3, స్కూల్ అసిస్టెంట్ (పీఈ) ప్రభుత్వ 1 ఉన్నారన్నారు. విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయుల జాబితా విద్యాశాఖ వెబ్‌సైట్ లో అందుబాటులో ఉందని చెప్పారు.

## క్లుప్తంగా

### రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఆర్థిక ఇబ్బందులో? లేక కుటుంబకలహాలో? మరే ఇతర కారణమో స్పష్టంగా తెలియదు గానీ గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నెల్లూరు సౌత్ రైల్వేస్టేషన్‌లో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయసు 40 నుంచి 45 ఏళ్ల లోపు ఉండొచ్చని భావిస్తున్నారు. రెడ్, బ్లూ కలర్ చెక్స్ గల ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, వైట్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. చనిపోయిన వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మైపాడు బీచ్‌లో బాలిక మృతి



బాలిక మృతదేహం

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడు బీచ్‌లో ఓ బాలిక మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. కలిగిరి సర్కిల్ ఆఫీస్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసే చొప్పర మాధవ్ తన కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం మైపాడు బీచ్‌కు వచ్చారు. అందరూ కలిసి నీటిలో మునుగుతున్నారు. ఈ సమయంలో మాధవ్ కుమార్తె మన్విత (12) నీరు తాగేసి పడిపోయింది. కుటుంబసభ్యులు గమనించి వెంటనే బాలికను బయటకు తీసుకొచ్చారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకుంది. చికిత్స నిమిత్తం మన్వితను నెల్లూరుకు తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. కొంతసేపటి క్రితం వరకు తమతో ఉన్న బాలిక ఒక్కసారిగా తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై వెంకటరాజేష్ వివరాలు సేకరించారు.

### గడ్డివాములు దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రాపూరు: మండలంలోని వెలుగోను గ్రామంలో ఇద్దరికి చెందిన గడ్డివాములు మంగళవారం దగ్ధమైనట్లు అగ్నిమాపక అధికారి కుప్పయ్య తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన నారపరెడ్డికి చెందిన 300 గడ్డి మోపులు, వెంకటరెడ్డికి చెందిన 100 గడ్డిమోపులతో వేసిన వాములకు నిప్పు అంటుకుంది సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే గడ్డి వాములు కాలిపోయాయి. ఈ ఘటనలో సుమారు రూ.48 వేల ఆస్తినష్టం జరిగినట్లు అగ్నిమాపక శాఖాధికారి తెలిపారు.

### నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

| | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) | : 160 |
| లేయర్ (లైవ్) | : 100 |
| బ్రాయిలర్ చికెన్ | : 270 |
| బ్రాయిలర్ స్కిన్‌లెస్ | : 300 |
| లేయర్ చికెన్ | : 170 |



### పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

| | |
|---|---|
| పెద్దవి | : రూ.40 |
| సన్నవి | : రూ.20 |
| పండ్లు | : రూ.10 |





**జిల్లా నీటి యాజమాన్య సంస్థ - శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా**

ఆర్.సి.నెం. A3/2/7Registers/2021 తేది : 06.06.2023

**స్వల్పకాలిక టెండరు ప్రకటన**

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, జిల్లా నీటి యాజమాన్య సంస్థ నందు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకమునకు సంబంధించిన Printing of Musters & M.Books ముద్రించి సరఫరా చేయుటకు గాను ఆసక్తి గల వారి నుండి స్వల్పకాలిక సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. కావున టెండరుదారులు రూ.5000/- "శ్రీయుత ప్రాజెక్ట్ డైరెక్టరు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, నెల్లూరు" వారి పేరిట ఏదైనా నేషనలైజ్డ్ బ్యాంక్ నుండి డి.డి. చెల్లించి తేది. 08.06.2023 నుండి తేది. 14.06.2023 లోగా కార్యాలయ పనివేళలలో టెండరు షెడ్యూలు ఫారము మరియు పూర్తి వివరములు నెల్లూరు, డ్వామా కార్యాలయములో పొందవచ్చును. టెండరు షెడ్యూలు నందలి నియమ నిబంధనల ప్రకారము టెండరు షెడ్యూలు ఫారము పూర్తి చేసి తేది. 15.06.2023 కార్యాలయపు పని వేళలలో (5 pm) లోగా నెల్లూరు డ్వామా కార్యాలయము నందు దాఖలు చేయవలెను. సదరు టెండర్లను శ్రీయుత జాయింట్ కలెక్టర్ / చైర్మన్, జిల్లా కొనుగోలు కమిటీ, నెల్లూరు వారు మరియు హాజరయిన టెండరుదారుల సమక్షములో తేది. 16.06.2023 శుక్రవారం 5 pm గం॥ లకు శ్రీయుత జాయింట్ కలెక్టరు గారి చాంబరు, జిల్లా కలెక్టరు వారి కార్యాలయము, నెల్లూరు నందు తెరవబడును.

| | |
|---|---|
| సం/- డి.వెంకటరావు<br>పథక సంచాలకులు, జిల్లా నీటియాజమాన్య సంస్థ<br>శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు. | సం/- ఆర్.కూర్మనాథ్<br>జాయింట్ కలెక్టర్/చైర్మన్<br>జిల్లా కొనుగోలు కమిటీ, నెల్లూరు |

# నగదు రహిత చెల్లింపులే సౌలభ్యం

మనం ఇంటి నుంచి బయటకు వెళ్లినప్పుడు ఖర్చులకు జేబులో డబ్బులు లేకపోయినా ఎలాంటి చింత లేదు. మీ బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు.. చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు. నగదు రహిత లావాదేవీలు జరిపి మనకు కావాల్సిన వస్తువులు కొనుక్కోవచ్చు. కొంతకాలంగా నోటును వినియోగించడం కంటే నగదు రహిత లావాదేవీలకే ప్రజలు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు.

- నోట్ల ద్వారా లావాదేవీలకు క్రమంగా చెల్లు చీటీ
- ఆన్‌లైన్ చెల్లింపుల వైపు మొగ్గు
- పెరిగిన డిజిటల్ పేమెంట్లు



మెస్‌లో వినియోగిస్తున్న పేటీఎం క్యూఆర్ కోడ్ బోర్డు

కోవూరు: కొంతకాలం క్రితం పెద్ద పెద్ద మాల్స్, వ్యాపార సంస్థల్లోనే డిజిటల్ పేమెంట్లు చేసే అవకాశం ఉండేది. ప్రస్తుతం ఈ సౌకర్యం చిరు వ్యాపారాల చెంతకు సైతం చేరింది. నోటును వినియోగించి లావాదేవీలు చేయడం తగ్గుతుండగా, ఆన్‌లైన్‌లో నగదు రహిత లావాదేవీల వైపే ప్రజలు మొగ్గుచూపుతున్నారు.

**గణనీయమైన మార్పు**

ఆరేళ్ల క్రితం పెద్ద నోట్ల రద్దు తరువాత డిజిటల్ పేమెంట్లను ప్రోత్సాహించేందుకు ప్రభుత్వం ప్రయత్నించినా అప్పట్లో పెద్దగా ప్రజలు ఆసక్తి చూపించేవారు కాదు. పెద్ద పెద్ద మాల్స్‌లో మాత్రమే పేమెంట్ యాప్‌లు, క్రెడిట్, డెబిట్ కార్డులతో చెల్లింపులు జరిగేవి. నగదు వేరే వారి ఖాతాలోకి వెళ్లిపోతుందన్న అపోహలు, ఆర్థిక మోసాలు జరుగుతాయన్న ఆందోళనతో ప్రజలు నగదు రహిత లావాదేవీలపై ఆసక్తి చూపేవారు కాదు. కోవిడ్ అనంతర పరిణామాలతో నగదు రహిత లావాదేవీలు జరపడంలో గణనీయమైన మార్పులు వచ్చాయి.

**అన్నిచోట్ల ఆన్‌లైన్ చెల్లింపులు**

ఫోన్ పే, గూగుల్ పే, అమెజాన్ తదితర పేమెంట్ యాప్‌ల ద్వారా అన్నిచోట్లా ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగాయి. కిరాణా, ఫ్యాన్సీ, మందుల షాపులు, పెట్రోల్ బంక్‌లు, ఇతర దుకాణాలతో పాటు చివరకు నెట్టుడు బండ్లపై చిరువ్యాపారాలు నిర్వహించేవారు సైతం ఫోన్ పే, గూగుల్ పే తదితర యాప్‌ల ద్వారా నగదు రహిత లావాదేవీలు జరుపుతున్నారు. మొబైల్, డీటీహెచ్, రీచార్జ్‌లు, గ్యాస్ బిల్లులు, ఇతర ఆర్థిక లావాదేవీలు చాలావరకు ఈ యాప్‌ల ద్వారానే జరుగుతున్నాయి. పేమెంట్ యాప్‌లు వినియోగిస్తున్న వారిలో యువత ముందు వరుసలో ఉంటున్నారని ఆయా సంస్థల ప్రతినిధులు చెబుతున్నారు. టీ స్టాల్, భోజన హోటళ్లు, తోపుడు బండ్లు, రోడ్ల పక్కన పండ్ల దుకాణాలు నిర్వహించే వ్యాపారులకు సైతం ఆన్‌లైన్ చెల్లింపులు ప్రయోజకరంగా మారాయి. ప్రధానంగా చిల్లర సమస్యతో వీరికి వ్యాపారాలు పోతుంటాయి. ఆన్‌లైన్ చెల్లింపుల వల్ల చిల్లర సమస్య తీరడంతో చిరువ్యాపారులు కూడా నగదు రహిత చెల్లింపుల వైపే మొగ్గుచూపుతున్నారు.



దుకాణంలో క్యూఆర్ కోడ్ బోర్డులు

**క్షణాల్లో క్యూఆర్ కోడ్ బోర్డులు**

పేమెంట్ యాప్‌లకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌లను ఆయా సంస్థల ఏజెంట్లు క్షణాల్లో అందజేస్తున్నారు. ఇప్పుడు ఏ దుకాణం వద్ద చూసినా క్యూఆర్ కోడ్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. అయితే ఆన్‌లైన్ చెల్లింపులు సౌలభ్యంగా ఉండడంతోపాటు ఆదమరిస్తే మోసాలకు కూడా ఆస్కారం ఉంటుందని నిపుణులు అంటున్నారు. వీటిపై అవగాహన లేని వారిని లక్ష్యంగా చేసుకొని ఆన్‌లైన్ మాయగాళ్లు మోసాలకు పాల్పడుతుంటారు. అయితే ప్రస్తుతం కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన క్యూఆర్ కోడ్ స్పీకర్ బాక్సులు ఇలాంటి అక్రమాలకు చెక్ పెడుతున్నాయి. ఆన్‌లైన్ చెల్లింపులు జరగ్గానే దుకాణదారుడికి ఎంత జమ అయిందన్న విషయాన్ని ఆడియో ద్వారా వినిపిస్తుంది. తద్వారా మోసాలకు కూడా అడ్డుకట్ట పడుతుంది.

**ఆన్‌లైన్‌లోనే ఎక్కువశాతం చెల్లింపులు**



ఎక్కువ శాతం ఖాతాదారులు ఆన్‌లైన్‌లో నగదు చెల్లింపులు చేస్తున్నారు. గతంలో ఏదైనా వస్తువు కొనుగోలు చేస్తే చిల్లర సమస్యలతో వ్యాపారాలు జరిగేవి కావు. గతంతో పోలిస్తే ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగాయి. చిల్లర సమస్య కూడా తొలగిపోవడంతో వ్యాపారాలు జరుగుతున్నాయి.

– జి.మురళీకృష్ణ, కిరాణా షాపు నిర్వాహకుడు

**డిజిటల్ బ్యాంకింగ్ సేవలు పెరిగాయి**



ప్రస్తుతం వినియోగదారులు అధికంగా నగదు రహిత లావాదేవీలు చేస్తున్నారు. ఇంటి వద్ద నుంచే అన్ని రకాల సేవలు పొందుతున్నారు. దీని వల్ల బ్యాంక్‌కు వచ్చే సంఖ్య బాగా తగ్గింది. ఆన్‌లైన్ బ్యాంకింగ్ వల్ల ఖాతాదారులకు భద్రత ఎక్కువగా ఉంటుంది.

– కె.సురేష్‌బాబు, మేనేజర్, ఏపీజీబీ పడారుపల్లి శాఖ

# ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ చేరాయి. ఇందులో అవినీతికి తావు లేదు. అర్హతే ప్రామాణికం.' అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. దగదర్తి మండలం చెన్నూరు గ్రామంలో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన చేస్తున్నట్లు చెప్పారు. పేదలు, రైతన్నలకు మంచి చేయాలని ఆయన ఎంతగానో కృష్టపడుతున్నారని తెలిపారు. చంద్రబాబు మాత్రం అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సొమ్ము దోచుకున్నాడని విమర్శించారు. బుద్ధి లేని బాబు సీఎం జగన్ పథకాలు, పనులను కాపీ కొడుతున్నారని చెప్పారు. సీఎంగా పనిచేసినంత కాలం బాబు ప్రజల కోసం ఏమి చేయలేదన్నారు. ఇప్పుడు పొత్తుల కోసం పాకులాడుతున్నారని విమర్శలు గుప్పించారు. జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలను వారికి అండగా నిలిచేందుకు మేనిఫెస్టోని రూపొందించారన్నారు. కానీ చంద్రబాబు అలా కాదన్నారు. గెలిచే వరకు ప్రజలను బతిమాలడడం.. గెలిచాక మేనిఫెస్టోను చెత్తబుట్టలో పడేసి వెన్నుపోటు పొడవడం ఆయనకు అలవాటే అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్ నాయుడు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ అనిల్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల అభిమానం వెలకట్టలేనిది



75 వేల గడపలు పూర్తయిన సందర్భంగా పూలతో వేసిన చిత్రం వద్ద ప్రసన్న, నాయకులు

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి
- నియోజకవర్గంలో 75 వేల గడపలు పూర్తి

కొడవలూరు: 'గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా కోవూరు నియోజకవర్గంలో 75 వేల గడపలు తిరిగాం. ప్రజలు, నాయకులు, కార్యకర్తల వల్లే ఇది సాధ్యమైంది. వారి అభిమానం వెలకట్టలేనిది.' అని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. 75 వేల గడపలు పూర్తయిన సందర్భంగా మండలంలోని గండవరంలో మంగళవారం విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఉదయకోశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 1.07 లక్షల గడపలు తిరగాల్సి ఉందని, ఇది సాధ్యమేనా అన్న అనుమానం తొలుత తనలోనూ రేకెత్తిందని తెలిపారు. కార్యక్రమాన్ని ప్రారంభించాక ప్రతి ఇంటా చూపిన అభిమానం ఉత్సాహాన్ని రెట్టింపు చేసిందన్నారు. దీంతోనే సునాయసంగా 75 వేల ఇళ్లకు వెళ్లి ఆయా కుటుంబసభ్యులతో మాట్లాడినట్లు చెప్పారు. ఇదే ఉత్సాహంతో మిగిలిన ఇళ్లు కూడా పూర్తి చేస్తానన్నారు. ఇప్పటి వరకూ ఎమ్మెల్యేలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు పథకాలు అందాయా? లేదా? అని తెలుసుకున్న పరిస్థితి ఏ రాష్ట్రంలోనూ లేదన్నారు. ఓటు వేసి గెలిపించిన వారి బాగోగులు ఎమ్మెల్యేలు చూడాలన్న ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ మహత్తర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం సువర్ణాక్షరాలతో లిఖించవచ్చన్నారు.

**పథకాలు అందిస్తున్నాం**

సంక్షేమ పథకాలను రాజకీయ పార్టీలు, కుల మతాలకు అతీతంగా అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డేనని ఎమ్మెల్యే అన్నారు. గతంలో కొందరు ఇతర పార్టీల వారికి ఎలాంటి పనులు చేయవద్దని అధికారులను ఆదేశించడమే కాక ప్రతిపక్ష పార్టీ వారికి ఒక్క పథకమూ అందనిచ్చేవారు కాదన్నారు. సంక్షేమ పథకాల అమలు విధానంతోనే జగన్‌మోహన్‌రెడ్డి మనసు ఏమిటో అర్థమవుతుందని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రజలే కాక నేతలు, కార్యకర్తలు, అధికారులు తనను ఇంటి బిడ్డగా ఆదరిస్తుండడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ ప్రతిష్టను మరింత పెంచుతున్న వలంటీర్లను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్, డీఏఏబీ చైర్మన్‌లు వీరి చలపతిరావు, దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, జొన్నవాడ దేవస్థాన చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, పూండ్ల అచ్యుత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాల కన్వీనర్లు గంధం వెంకటశేషయ్య, మావులూరు శ్రీనివాసులురెడ్డి, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, నలుబోలు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా కరిమాణిక్యస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యస్వామి

నాయుడుపేటటౌన్: తుమ్మూరులో ఉన్న కరిమాణిక్య స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం వైభవంగా జరిగింది. ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ, ప్రత్యేక పూజల అనంతరం రథంలో కొలువుదీర్చారు. రథాన్ని లాగేందుకు వేలాది మంది భక్తులు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామస్మరణలతో తుమ్మూరు హోరెత్తింది. భక్తులు రథంపై ఉప్పు మిరియాలు చల్లి, మొక్కులు తీర్చుకున్నారు. పలు కూడళ్లలో దాతలు భక్తులకు తాగునీరు, మజ్జిగ తదితరాలను పంపిణీ చేశారు. సీఐ నరసింహారావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. తుమ్మూరు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, సహస్రనామార్చన, బలిహరణం, మధ్యాహ్నం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, రాత్రి ఊంజల్ సేవ, ఏకాంతసేవ జరిపారు. రాత్రి ఆలయ ప్రధాన అర్చకులు శేషాద్రిస్వామి ఆధ్వర్యంలో స్వామి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ శాంతి, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఏఈఓ రవికుమార్‌రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు హరిరెడ్డి, సుధీర్, ఎలక్ట్రికల్ ఏఈ ఆంజనేయరాజు, ఆలయ మాజీ ట్రస్టీ కె.రామకృష్ణారెడ్డి, కె.మోహన్‌రెడ్డి, పి.గంగాప్రసాద్, సురేష్‌కుమార్‌రెడ్డి, నరసారెడ్డి, మాజీ కౌన్సిలర్ శివరెడ్డి పాల్గొన్నారు.

- బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి పార్వేట ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్లు హరిరెడ్డి, సుధీర్ తెలిపారు. ఉదయం తిరుచ్చి ఉత్సవంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

### ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

దక్కిలి: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని గూడూరు డిప్యూటీ డీఈఓ శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. దక్కిలిలోని ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఉన్న జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 3,770 మంది విద్యార్థులకు విద్యా కానుక కిట్లను పంపిణీ చేయాలన్నారు. గ్రామాల్లోని పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదివేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### వైద్య సిబ్బందితో సమావేశం

దక్కిలి: మలేరియా వ్యవతిరేక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశ వర్కర్స్, వైద్య సిబ్బందితో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దక్కిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి బిందు ప్రియాంక మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిఒక్కరూ దోమతెరలు వినియోగించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు.

### వివాహితపై దాడి

సైదాపురం: ఓ వివాహితపై దాడి చేసి గాయపరిచిన ఘటన మంగళవారం కలిచేడు గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కలిచేడు గ్రామానికి చెందిన ఎస్.ఈశ్వరమ్మ కుమార్తె మమత కొంతకాలం నుంచి భర్త నుంచి విడిపోయి పుట్టింట్లోనే ఉంటుంది. ఈ క్రమంలో ఇంటి పక్కనే ఉన్న బొడ మహేష్, మమతను నిత్యం వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ విషయమై పెద్దలకు చెప్పడంతో మహేష్‌ను వారు మందలించారు. ఈ క్రమంలో మమత ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో మహేష్ వెళ్లి కత్తితో బెదిరించి దాడి చేశాడు. ఆమె కేకలు వేయడంతో అతను పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నట్లు ఎస్సై నాగబాబు తెలిపారు.